క్లుప్తంగా

రాచమల్లు జన్మదిన వేడుక

రాజుపాళెం: మండలంలోని వెల్లాల వృద్ధాశ్రమంలో ప్రొద్దుటూరు మాజీ శాసన సభ్యులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి జన్మదిన వేడుక శుక్రవారం నిర్వహించారు. వెల్లాల వైఎస్సార్‌సీపీ నాయకులు గూడెం చెరువు సత్యబాబు, గూడెం చెరువు రవి ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, శివ, అజయ్ కుమార్, సుగుణ పాల్ తదితరులు పాల్గొన్నారు.

వరిలో పంట కోత ప్రయోగం

చాపాడు: ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగైన వరి పంటలో 33 బస్తాల దిగుబడి వస్తున్నట్లు నేషనల్ సీనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ చౌరాసియా తెలిపారు. కేతవరం రెవెన్యూ గ్రామ పొలంలో శుక్రవారం వరి పంటలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకూ పంట కోత ప్రయోగం చేయగా ఎకరాకు 2,457 కిలోల దిగుబడి వచ్చినట్లు అంచనా వేయడం జరిగిందన్నారు. ఈ లెక్కన ఎకరాకు 32 నుంచి 33 బస్తాల వరకూ వరి పంట దిగుబడులు వస్తున్నట్లు ఎన్ఎస్ఎస్ఓ తెలిపారు. వీఏఏ గోపిరామ్ పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

కాశినాయన: మండలంలోని వరికుంట్ల గ్రామానికి చెందిన బసిరెడ్డిదుగ్గిరెడ్డి పోరుమామిళ్ల నుండి స్కూటీలో వరికుంట్ల గ్రామానికి వెళుతుండగా ఓబుళాపురం వద్ద శుక్రవారం రాత్రి 7–30 గంటల సమయంలో అదుపుతప్పి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనానికి ఫోన్ చేసి పోరుమామిళ్ళ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళారు.

చెవికెక్కని చావు కేకలు..!

- అధికారుల నిర్లక్ష్యానికి బలవుతున్న అమాయక జనం
- ఈ ఏడాది 52 రోడ్డు ప్రమాదాల్లో 22 మంది మృతి, 53 మంది క్షతగాత్రులు
- వరుస ప్రమాదాలకు నిలయమవుతున్న రహదారులు
- డివిజన్ పరిధిలో 50కి పైగా ప్రమాదకర బ్లాక్ హోల్స్



మల్లకతువ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బోల్తా పడిన లారీ(ఫైల్)



పోరుమామిళ్ల - మైదుకూరు రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత (ఫైల్)

బద్వేలు: ఒక ప్రమాదం జరుగుతుంది. అరడజను మంది ప్రాణాలు గాల్లో కలుస్తాయి. ఆ నెత్తుటి తడి ఆరక ముందే ఇంకో ప్రమాదం. ఆ విషాదం మది నుండి నిష్క్రమించక ముందే మరో ప్రమాదం. ఇలా వరుస ప్రమాదాలతో పదుల సంఖ్యలో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఇటీవల పోరుమామిళ్ల మైదుకూరు ప్రదాన రహదారిలో ముద్దిరెడ్డిపల్లె దగ్గర మోటర్ బైక్‌ను టిప్పర్ ఢీ కొనడంతో పోరమామిళ్ల మండలం చిన్నాయపల్లె గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే చనిపోయారు. ఈ ఏడాది ప్రారంభం నుండి డిసెంబర్ చివరి వరకు బద్వేల్ నియోజక వర్గంలో 59 ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 22 మంది ప్రాణాలు గాల్లో కలిశాయి. 53 మంది క్షత గాత్రులయ్యారు. వీరిలో ఎక్కువ మంది కాళ్లు, చేతులు కోల్పోయి శాశ్వత వికలాంగులుగా మారారు. ఇవి పోరుమామిళ్ల, బద్వేల్ సర్కిళ్ళ పరిధిలోని పోలీసుస్టేషన్లల్లో నమోదైన ప్రమాదాలు మాత్రమే. అయితే పోలీసుస్టేషన్‌లో నమోదు కాకుండా ఉన్నవి చాలానే ఉన్నా యన్నది జగమెరిగిన సత్యం. ఫలితంగా పదే పదే జరుగుతున్న ప్రమాదాలు అమాయకులను బలి తీసుకుంటున్నా కీలకమైన రోడ్డు భద్రత కమిటీకి చీమ కుట్టినట్లయినా లేకపోవడం గమనార్హం. నియోజకవర్గంలోని రహదారుల్లో ఏకంగా 50కి పైగా ప్రమాదకర ప్రాంతాలు(బ్లాక్‌హోల్స్) ఉన్నట్లు నిపుణులు గుర్తించారు. ఏళ్లు గడుస్తున్నా పోలీసులు గానీ అటు రోడ్డు భవనాలశాఖ గానీ చాలా చోట్ల బ్లాక్ హోల్స్ వద్ద ఎటువంటి ప్రమాద హెచ్చరికలు సూచించే బోర్డులు ఏర్పాటు చేయలేదు. వరుసగా జరుగుతున్న ప్రమాదాలకు కారణమేంటని గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాల్సిన రోడ్డు భద్రతా కమిటీ ఇప్పటికీ ఒక సమావేశం కూడా జరుపక పోవడం గమనార్హం. రోజు వారి అధికారిక కార్యక్రమాలు, వ్యక్తిగత కార్యక్రమాల్లో తీరికలేని కొందరు కీలక అధికారులు సమావేశానికి సమయం కేటాయించక పోవడమే ఇందుకు ప్రదాన కారణంగా తెలు స్తోంది. అయితే సమావేశం ఏర్పాటుచేసే విషయంపై రోడ్డు రవాణా శాఖ కూడా ఏలాంటి చర్యలు తీసుకోలేదు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఎస్పీ, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, ఆర్డీఓలు, ఆర్డీఓలు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాదికారి, ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా వ్యవహరించే రోడ్డు భద్రత కమిటీ ప్రతి మూడేళ్ల కోసారి తప్పనిసరిగా సమావేశమై జిల్లాలో జరుగుతున్న ప్రమాదాలపై సమీక్ష జరపాలి. కానీ ఇంతవరకూ అలాంటి సమావేశం ఒకటి కూడా జరిగినట్లు లేదన్నది వినికిడి. ఎప్పుడో మూడు నాలుగేళ్ల కిందట సమావేశం జరిగి అందులో తీసుకున్న నిర్ణయాలు మాత్రం అమలుకు నోచుకోలేదు. ఐదేళ్లలో జరిగిన ప్రమాదాలను ప్రామాణికంగా తీసుకుని నియోజకవర్గ పరిధిలో రహదారులపై 50కి పైగా బ్లాక్ హోల్స్ ఉన్నట్లు నిపుణులు గుర్తించారు. వీటిని సురక్షిత ప్రయాణానికి అనువుగా మార్చాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధిపతులకు ఉంది. రహదారుల డిజైన్ లోపం, దెబ్బతిన్న ప్రాంతాల్లో సిగ్నల్స్ లేకపోవడం, ప్రమాదకర మలుపులు, మలుపుల దగ్గర రోడ్డు వెంబడి పెరుగుతున్న కంప చెట్లు, లోపాలున్న కల్వర్టులు, బ్రిడ్జీలు, రోడ్లపై ఏర్పడిన గుంతలు, ఇలాంటి ఎన్నో లోపాల మూలంగా అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నట్లు నిపుణులు తెలిపారు. పోరుమామిళ్ల-గిద్దలూరు, పోరుమామిళ్ల-కొమరోలు, పోరుమామిళ్ల -మైదుకూరు, బద్వేల్-మైదుకూరు, బద్వేల్-నెల్లూరు, బద్వేల్-కడప వెళ్లే మార్గాల్లో అత్యధిక బ్లాక్‌హోల్స్ ఉన్నట్లు తెలుస్తోంది. గుర్తించిన ప్రదేశాల్లో పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధంచేసుకుని బడ్జెట్ కోసం ప్రభుత్వానికి పంపే బాధ్యత కమిటీలో సభ్యులైన ఆయా శాఖాధిపతులదే.. కానీ చాలా ఏళ్ల కిందట జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు కూడా ఇప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. బద్వేల్ మీదుగా అనంతపురం-నెల్లూరు జాతీయ రహదారి వెళ్లుతోంది. అలాగే బద్వేల్-తిరుపతి, బద్వేల్-కడప మీదుగా రాష్ట్ర రహదారులు ఉన్నాయి. రాష్ట్ర రహదారుల్లోని లోపాలను రోడ్డు సేఫ్టీ కమిటీలోని సభ్యులు చర్యలు తీసుకోవాల్సింది. కానీ వీరు ఎవరికి వారు యమునాతీరు అన్నట్లు ఉండటంతో జరగాల్సిన నష్టం జరిగి పోతోందని రోడ్డు రవాణా శాఖాధికారులు పేర్కొంటున్నారు.

అధిక వేగాన్ని అదుపులో పెట్టాలి



యువత అధిక వేగం, మద్యం సేవించి బైక్‌లు నడిపే వారిని గుర్తించి వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా యువత హైస్పీడ్ బైక్‌లు తీసుకుని అధిక వేగంగా నడపడం వలన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. బైక్‌లకు కూడా కంపెనీ నుండే స్పీడ్ లిమిట్ చేయాలి. ఎక్కడికక్కడ ప్రమాద చిత్రాలను ప్రదర్శిస్తూ పోస్టర్లు ఏర్పాటు చేయాలి. పోలీసులు విధించే అపరాధ రుసుం ఎక్కువగా ఉంటే కొంత వరకు ప్రమాదాలు నివారించవచ్చు. – బీఎస్‌వీ ప్రసాద్ ఉపాధ్యాయులు, కలసపాడు

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం



రోడ్డు ప్రమాదాల నివారణకు మా శాయశక్తుల చర్యలు తీసుకుంటున్నాం. వాహన చోదకులకు రోడ్డుప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం. బద్వేల్ రూరల్ సర్కిల్ పరిధిలో 4 మండలాల్లో చాలా వరకు రోడ్డు ప్రమాదాలు తగ్గాయి. – ఎం.నాగభూషణం, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, బద్వేలు రూరల్

నేడు వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

మైదుకూరు: మైదుకూరులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం నిర్వహించనున్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ సీఎం జన్మదిన వేడుకల నిర్వహణపై మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. శనివారం ఉదయం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తామని రఘురామిరెడ్డి తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన కేక్‌ను కట్ చేసి వేడుకలను నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో చాపాడు, దువ్వూరు ఎంపీపీలు కె.లక్ష్మయ్య, జయచంద్రారెడ్డి, మైదుకూరు వైస్ ఎంపీపీ రఘురామిరెడ్డి, మైదుకూరు పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, ఖాజీపేట మండల నాయకులు రాఘవరెడ్డి, మురళీ మోహన్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ మూలే సుధాకర్‌రెడ్డి, కిరణ్మయి, ఎంపీటీసీ ఇర్షాద్, ఇడగొట్టు శేషు, మైనారిటీ నాయకులు ఖాదర్, కందనూరు షరీఫ్, మాబుచాన్ తదితరులు పాల్గొన్నారు.

చాపాడు: మండల కేంద్రమైన చాపాడు శనివారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 52వ జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్లు ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య తెలిపారు. ఉదయం 9గంటలకు చాపాడు నాలుగు రోడ్ల కూడలిలోని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు, మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

రైతులకు న్యాయం జరిగేలా చర్యలు



సమస్యను తెలుపుతున్న బాధిత రైతులు

చాపాడు: చియ్యపాడు గ్రామానికి చెందిన సొసైటీ భూముల రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు రమాకుమారి పేర్కొన్నారు. మండలంలోని చియ్యపాడు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో దళితులకు చెందిన సొసైటీ భూములకు ఆన్‌లైన్ సమస్య నెలకొందని సమస్యను పరిష్కరించి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేయాలని బాధిత రైతులతో కలసి గ్రామ సర్పంచ్ శివప్రసాద్ తహసీల్దారు దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన తహసీల్దారు మాట్లాడుతూ అసైన్మెంట్ కమిటీ ఏర్పడగానే సర్వే చేపట్టి అర్హులకు భూమి మంజూరు చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో దళితవాడను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డి, రీసర్వే డీటీ నారాయణ స్వామి, ఆర్ఐ శివశంకర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మొండి పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులు



పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని మొండి పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలో జరుగుతున్న పన్ను వసూలు కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి, నీటి పన్నులు పెండింగ్‌లో ఉన్న టాప్ వంద మందిని గుర్తించి ఇప్పటికే వారికి కూడా నోటీసులు అందజేశామని తెలిపారు. 23 సచివాలయాల్లో పన్ను వసూళ్ళ కొరకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు మున్సిపల్ కార్యాలయంలో ఈ నెలాఖరు వరకు సెలవు రోజులలో కూడా మధ్యాహ్నం 1 గంట వరకు కౌంటర్ తెరిచే ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఓ రఘునాథరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షఫి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అండతో అక్రమార్జన



నివాసాలు లేని చోట సీసీరోడ చిత్రాలు చూపుతున్న బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు: ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి అండతో కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి దందా కొనసాగిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సర్పంచ్ టెంకాయలు కొట్టి వ్యాపారం చేస్తున్నారని, డబ్బు సంచులు వచ్చే చోటే రోడ్లు వేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అమృతా నగర్‌లో 34 సిమెంటు రోడ్లు వేయించామని, ఈ విషయాన్ని సర్పంచ్ పట్టించుకోకుండా ప్రజలు నివాసంలేని చోట సీసీ రోడ్లు వేస్తున్నారని తెలిపారు. కేవీఆర్, డాక్టర్స్ కాలనీల్లో ప్రజలు లేని చోట సిమెంటు రోడ్లు వేశారన్నారు. కేవల 1.25 కోట్లతో డ్రైనేజీ కాల్వ నిర్మాణం సాకుచూపి మైదుకూరు రోడ్డులో ఇష్టం వచ్చినట్లు భవనాలను తొలగిస్తున్నారని తెలిపారు. ఆయనకు డబ్బు ముట్టజెప్పిన వారికి ఓ విధంగా, లేని వారికి మరో విధంగా చేస్తున్నారన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్‌కు సంబంధించి కుళాయి కనెక్షన్ కోసం రూ.10 లక్షలు వసూలు చేసినట్లు తన వద్ద ఆధారాలున్నాయని, నిరూపించలేని పక్షంలో తాను వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తానన్నారు. పేరం సునీత, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్, మట్కాను ఎందుకు నిర్మూలించలేదు

వైఎస్సార్‌సీపీ హయాంలో గుట్కా,, మట్కా, క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాలపై విమర్శలు చేసిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఇపుడు ఎందుకు నిర్మూలించలేక పోతున్నారని బంగారు మునిరెడ్డి ప్రశ్నించారు. కొందరు కౌన్సిలర్లు, సర్పంచ్‌లే మట్కా, క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్నారు. వారే బియ్యం మాఫియాగా ఏర్పడి చెన్నై, నెల్లూరు నుంచి షిప్‌లలో తరలిస్తున్నారన్నారు. వీఆర్ఓ మొదలు డీఎస్పీ స్థాయి అధికారి వరకు మీ లెటర్ ప్యాడ్ ద్వారా ఇక్కడికి వచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రొద్దుటూరులో నంద్యాల కొండారెడ్డి, సీఎం సురేష్‌నాయుడు దందా చేస్తున్నారన్నారు. చట్టం పేరుతో వ్యాపారులను కొంత మంది వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు.

సేంద్రియ వ్యవసాయం చేయాలి

ప్రొద్దుటూరు: రైతులు సేంద్రియ వ్యవసాయం చేసి ఖర్చులు తగ్గించుకోవాలని సుస్థిర వ్యవసాయ కేంద్రం రాష్ట్ర కో ఆర్డినేటర్ ఆదినారాయణ తెలిపారు. రాయలసీమ వాటర్ ఇన్షియేటివ్, మహిళా సొసైటీ ఆధ్వర్యంలో మదనపల్లె ప్రాంత రైతులు మండలంలోని తాళ్లమాపుర, కల్లూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను శుక్రవారం సందర్శించారు. సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో ఏజీ బయో ఫర్టిలైజర్స్‌ను రైతులు సందర్శించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

బద్వేలు అర్బన్: పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం, స్కానింగ్ సెంటర్ల యజమానులు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎన్‌జీవో హోంలో పీఎస్‌పీఎన్‌డీటీ యాక్టుపై నిర్వహించిన సబ్ డిస్ట్రిక్ లెవల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు ఆసుపత్రులలో అర్హత ఉన్న వారు మాత్రమే స్కానింగ్ చేయాలని సూచించారు. ప్రతి ఆసుపత్రిలో, స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమనే ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని సూచించారు. డాక్టర్ జె.వినయ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ సౌమ్య, పాల్గొన్నారు.

అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి



మైదుకూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. మైదుకూరు రోడ్డులోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో విభిన్న వర్గాల మనోభావాలు దెబ్బతినేలా రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నా.. ప్రధాని మోదీ ప్రోత్సహిస్తున్నారన్నారు. వారిని ఆక్షేపించిన ఇండియా కూటమి సభ్యుల నిరసనను పక్కదోవ పట్టించడానికి ప్రయత్నిస్తోందన్నారు. పార్లమెంట్ ద్వారం వద్ద జరిగిన తోపులాట సీసీ పుటేజీను కేంద్రం బయట పెట్టకుండా కాంగ్రెస్, వామపక్షాలపై కేసులు నమోదు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు హరి, ఎలయ్య, సలీం, పీటర్, వాసు, నాని, బాషా, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి

డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు సరికావని ఏపీ రాష్ట్ర మాలమహానాడు(జాకట విజయశేఖర్ వర్గం) రాష్ట్ర అధ్యక్షుడు జాకట విజయ్‌శేఖర్, రాయలసీమ అధ్యక్షుడు జేష్టాది భాస్కర్ తెలిపారు. అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం స్థానిక పాతబస్టాండ్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ ఏర్పడ్డాక జీవితాలు ఎలా మారాయో.. గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వెంటనే అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంపత్‌కుమార్, శ్రీనివాసులు, దీపక్, స్వరూప్, సామేల్ తదితరులు పాల్గొన్నారు.

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన హోంశాఖ మంత్రి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర మాలమహానాడు రామాజీ వర్గం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సుద్దపల్లి మురళీ తెలిపారు. స్థానిక పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కళ్లకు నల్లబ్యాడ్జీలను కట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంగటి పుల్లయ్య, మేకల ఓబులేసు, ఉల్లి కిరణ్‌కుమార్, సీకే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా క్రీడా పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కడప రీజనల్ స్థాయి 27వ ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడల పోటీలు రెండో రోజున శుక్రవారం జోరుగా సాగాయి. రాయలసీమ వ్యాయామ కళాశాలలో బ్యాడ్మింటన్, వాలీబాల్, 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పోటీలు నిర్వహించారు. బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రొద్దుటూరు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. శనివారం పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తామని ప్రిన్సిపల్ జింకా అశోక్‌బాబు తెలిపారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన

ప్రొద్దుటూరు: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున శుక్రవారం పర్యటించారు. మైదుకూరు రోడ్డులోని జిన్నా రోడ్డు వద్ద కాల్వలో షిల్ట్‌ను తొలగించాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. గాంధీ రోడ్డులోని మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా ఉన్న కాల్వ, వెంకటేశ్వర్లపేట కాల్వ, శ్రీరామ్ నగర్‌లోనూ పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు.

పేదలకు దుస్తులు అందజేత

ప్రొద్దుటూరు: స్థానిక బుడ్డాయపల్లెలోని విద్యార్థి అనాథాశ్రమంలో బాలలకు ఐడియల్ హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం బాలలకు భోజనం ఏర్పాటు చేశారు. డాక్టర్ బి.జిలాన్ బాషా, వసంత, వెంకట్, ఖలీల్ పాల్గొన్నారు.

చాపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పోరుమామిళ్లకు చెందిన చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ సహకారంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్.ప్రసాద్‌రెడ్డి, డా.గీత, తోమాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం పోరుమామిళ్లలోని హోలీ రోసరీ చర్చి పరిధిలోని 22 మంది వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఎఫ్‌సీఎన్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్ రెడ్డి దంపతులు అందించిన దుస్తులను సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి పంపిణీ చేశారు.

ఉక్కు పరిశ్రమ నిర్మించాలి

ప్రొద్దుటూరు కల్చరల్: వైఎస్సార్ జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రగతి శీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పీఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలో ఉక్కు పరిశ్రమను నిర్మించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సాగర్, వినోద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయాల్లో పూజలు

ప్రొద్దుటూరు : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఉదయం 9కు రామేశ్వరంలో పూజలు, 9.30కు ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ, 10.30కు విశ్వప్రేమ వృద్ధాశ్రమంలో కేక్ కటింగ్, వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఉంటాయన్నారు.